# మిరకిల్

**తల్లీ తండ్రీ మాట్లాడుకోవటం ఎనిమిదేళ్ళ కీర్తి విన్నది. తమ్ముడు రమేష్కి బాగా జబ్బు చేసింది. “నాలుగేళ్ళ నా కొడుక్కి నూరేళ్ళు నిండుతున్నాయా? వాడు బ్రతికే మార్గమే లేదా?” అని తల్లి జానకి ఏడుస్తోంది.**

**“ఇక మన చేతుల్లో ఏదీ లేదు. ఏదో మిరకిల్ ఒక్కటే వాడికి ప్రాణం పోయాలి!” అన్నాడు తండ్రి శ్రీరాం నిస్పృహగా.**

తన పుస్తకాల గూడు దగ్గరికి పరిగెత్తింది కీర్తి. తండ్రి అప్పుడప్పుడూ ఇచ్చిన చిల్లర డబ్బులు తన కిడ్డీ బేంకులో వేసుకుంది. అటూ ఇటు తిప్పితే అది గలగలలాడింది. చప్పుడు కాకుండా ఓ రాయి పెట్టి కొట్టి కిడ్డీ బేంకు మూతనెలాగో ఊడతీసింది. చిందరవందరగా క్రిందపడిన చిల్లర డబ్బులన్నీ పోగేసి తన కర్చీఫ్‌లో మూటకట్టింది. గబగబా బజారుకి పరిగెత్తింది.

మందుల షాపువాడు టెలిఫోన్‌లో మాట్లాడుతున్నాడు. వచ్చింది చిన్నపిల్ల. కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న పేదరికం. మరేం అర్జంటు లేదన్నట్టు చూస్తూ తన కబుర్లలో పడిపోయాడు.

''సార్! మా తమ్ముడికి ప్రమాదంగా వుంది. తొందరగా మిరకిల్ కావాలి!'' అని ప్రాధేయపడింది కీర్తి.

షాపువాడు వినిపించుకోలేదు. కీర్తి మళ్ళీ జాలిగా అడిగింది.

''ఫోన్‌లో మాట్లాడుతున్నా! కనిపించటంలే?'' అని చిరాకు పడ్డాడు షాపువాడు.

బిక్కమొహం వేసుకుని నిలబడిపోయింది కీర్తి. అప్పుడే అక్కడికి వచ్చిన ఒకాయన ఆమె మాటల్ని, షాపువాడి నిరాదరణను విన్నాడు.


''ఏం కావాలమ్మా?'' అని ఆదరంగా ఆమె భుజం మీద చేయివేసి అడిగాడు.

ఆ పిల్ల కళ్ళనిండా నీళ్ళు. ''మా తమ్ముడికి చాలా ప్రమాదంగా వుందిటండీ! మిరకిల్ ఒక్కటే ప్రాణం పోస్తుందిట. నాన్న అమ్మతో చెబుతుంటే విన్నా. నా దగ్గరున్న డబ్బుతో మిరకిల్ని కొందామని...'' అని సిగ్గుగా చూస్తూ ఆగిపోయింది.

ఆ పిల్ల కళ్ళలోని అమాయకత్వానికి అతని మనసు ఆర్ద్రత చెందింది.

''నీ దగ్గర ఎంత డబ్బుందమ్మా?'' అని బుజ్జగింపుగా అడిగాడాయన.

అతనికి తన దగ్గరున్న డబ్బు చూపిస్తూ ''ఏడు రూపాయల డెబ్బై ఐదు పైసలు'' అంది కీర్తి.



''అలాగా! నా దగ్గరో మిరకిల్ వుంది. దాని ఖరీదు సరిగ్గా ఏడు రూపాయలు. నీ తమ్ముడికి సరిపోతుందేమో చూద్దాం. నన్ను మీ ఇంటికి తీసుకు పద'' అన్నాడాయన- ఆమె ఇచ్చిన డబ్బుల మూటని తన కోటుజేబులో పెట్టుకుంటూ.

ఉత్సాహభరితంగా ఆయన చేయిపట్టుకుని దగ్గర్లోనే వున్న తమ ఇంటికి తీసుకువెళ్ళింది కీర్తి.

''అమ్మా! ఈయన దగ్గర మిరకిల్ ఉందిట!''

తమ పిల్ల ఏదో కొత్త చిక్కు తెచ్చిపెట్టిందని కీర్తిమీద చిరాకు పడ్డారు ఆమె తల్లిదండ్రులు.

వాళ్ళని వారిస్తూ ''మీకభ్యంతరం లేకపోతే నాతోపాటు పిల్లాడిని 'మా హాస్పిటలుకి తీసుకు రండి'' అన్నాడాయన.

అతనితోపాటు ఓ పెద్ద హాస్పిటల్లో అడుగుపెడుతున్నప్పుడు కాని ఆయన ప్రఖ్యాత సర్జన్ పరంధామ్ అని వాళ్ళకు తెలియలేదు. వాళ్ళు తమ ఆశ్చర్యం నుంచి తేరుకొనేలోగా ఆయన పాత రిపోర్టులు చూడటం, రమేష్కి టెస్టులు చేయడం, వెంటనే ఆపరేషన్‌కి ఏర్పాట్లు చేయడం నిమిషాల మీద జరిగిపోయింది.

ఆపరేషన్ చేసి చిరునవ్వుతో బయటకు వచ్చిన డాక్టర్ పరంధామ్‌తో ''మీ రుణం ఈ జన్మలో తీర్చుకోలేము డాక్టర్‌గారూ!'' అన్నాడు శ్రీరాం.

''డాక్టరుగారు తమ్ముడికి మిరకిల్ ఇచ్చారుగా! అందుకే జబ్బు నయమైంది'' అంది కీర్తి.

'ఆపరేషన్‌కి ఎంతయిందో!' అని తనలో తను గొణుక్కున్నట్టు అంది జానకి.

''డాక్టరుగారు నాతో చెప్పారమ్మా. మిరకిల్ ఖరీదు ఏడు రూపాయలట.

అవును కదా డాక్టర్‌గారూ?'' అంది కీర్తి పరంధామ్ దగ్గరికి వచ్చి.

''అవునమ్మా! మర్చేపోయాను, నా దగ్గర ఇంకా డెబ్బై ఐదు పైసలు నీవి మిగిలాయి. ఇంద తీసుకో!'' అని ఆ పిల్ల చేతుల్లో చిల్లర్ని పెట్టాడు డాక్టర్.

''మీరెంత మంచివారు డాక్టర్! మా తమ్ముడికి ప్రాణం పోసారు'' ఆ పిల్ల డాక్టర్ చేతులు పట్టుకుని కళ్ళకద్దుకుంది.

ఆ పిల్ల కళ్ళల్లో మెరుస్తున్న అద్భుతమైన తృప్తిని గుర్తించగలిగిన ఆ డాక్టర్ కళ్ళల్లోంచి అతని జీవితంలో ఎప్పుడూ ఎరుగని ఆనందభాష్పాలు చిప్పిల్లాయి.

**-తటవర్తి రామచంద్రరావు**
**(న్యూఢిల్లీ)**